హనుమాన్ పాత్రధారి రిషబ్‌శెట్టి

ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన 'హనుమాన్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ సినిమాలో హనుమాన్ పాత్రను ఓ అగ్ర హీరో పోషిస్తారని దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఇదివరకే వెల్లడించారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరింతగా అంచనాలు పెరిగాయి. హనుమాన్ పాత్రను పోషించే అవకాశం 'కాంతార' ఫేమ్ రిషబ్‌శెట్టిని వరించింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమాన్ పాత్రలో రిషబ్‌శెట్టి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన రాముడి విగ్రహాన్ని భక్తిపూర్వకంగా పట్టుకొని కనిపిస్తున్నారు. శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన మాటేమిటి అనే అంశం చుట్టూ సీక్వెల్ కథ నడుస్తుందని చెబుతున్నారు. 'హనుమాన్' చిత్రంలో హనుమంతు అనే పాత్రలో కనిపించిన హీరో తేజ సజ్జా..సీక్వెల్‌లోనూ అదే పాత్రను పోషిస్తున్నారు. 'ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. 'జై హనుమాన్' భక్తి, విధేయతలతో కూడిన ఎపిక్ చిత్రమని, ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినందిస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు.

నందమూరి నాలుగోతరం



తెలుగు సినీరంగంలో ఘనమైన చరిత్ర కలిగిన నందమూరి కుటుంబం నుంచి నాలుగోతరం హీరో వెండితెరపై అరంగేట్రం చేయబోతున్నాడు. హరికృష్ణ మనవడు, దివంగత జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావు సినీ రంగ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి నిర్దేశకత్వంలో న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బుధవారం 'నందమూరి తారక రామారావు ఫస్ట్ దర్శన్' పేరుతో చిత్ర కథానాయకుడిని పరిచయం చేస్తూ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అర్థవంతమైన పాత్రలకు ఎంచుకొని, పరిశ్రమకు విధేయుడిగా ఉంటానని తన తాత ఎన్టీఆర్‌పై ప్రమాణం చేసినట్లు గ్లింప్స్‌లో చూపించడం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌గారిపై ఉన్న అభిమానంతో నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. ఎన్టీఆర్ అనే మూడక్షరాల తారకమంత్రమే నాకు శక్తి. ఎన్టీఆర్ జీవితంలో 'సర్దార్ పాపారాయుడు' చిత్రానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ సినిమా అక్టోబర్ 30న విడుదలైంది. అదే రోజు ఈ వేడుక జరుపుకోవడం ఆనందంగా ఉంది. నేను పరిచయం చేసిన హీరోలందరినీ ప్రేక్షకులు ఆదరించారు. అదే విధంగా నందమూరి తారకరామారావును కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నా. నందమూరి నాలుగోతరం నుంచి అద్భుతమైన హీరో అవుతాడనే నమ్మకం ఉంది' అన్నారు. నందమూరి వంశంలో కొత్తశకం ఆరంభమైందని, ఈ హీరో అపూర్వ విజయాలను సొంతం చేసుకోవాలని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వనీదత్ ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: కీరవాణి, సాహిత్యం: చంద్రబోస్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వైవీఎస్ చౌదరి.

1980 దశకంలోకి ప్రయాణం

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకుడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. వింటేజ్ బ్లాక్ అండ్ వైట్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. 1980 దశకంలో జరిగిన కొన్ని యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఓ సాధారణ యువకుడు అత్యంత శక్తివంతుడిగా ఎదిగిన వైనాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించామని మేకర్స్ తెలిపారు. 1980 దశకం వాతావరణాన్ని కళ్లకుకట్టినట్లుగా సినిమాలో చూపించామని, పవర్‌పుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని దర్శకుడు చెప్పారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి, నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిషోర్ కుమార్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

భాస్కర్ గెలవాలని కోరుకుంటారు

'విడుదలకు ముందే 'లక్కీ భాస్కర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ నమ్మకంతోనే ప్రీమియర్లు వేస్తున్నాం. నిర్మాతగా ఈ సినిమా ఎంతో సంతృప్తినిచ్చింది. ప్రేక్షకులు కూడా తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు అగ్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఆయన నిర్మించిన 'లక్కీ భాస్కర్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించారు. బుధవారం సాయంత్రం నుంచే ప్రీమియర్ షోలు ప్రదర్శితమవుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ప్రీమియర్స్‌కు మంచి స్పందన వస్తుండటంతో షోస్ సంఖ్య కూడా పెంచాం. బ్యాంకింగ్ నేపథ్యంలో థ్రిల్లర్ జోనర్‌లో నడిచే ఫ్యామిలీ కథాంశమిది. మనిషి డబ్బు సంపాదించాలనుకున్నప్పుడు ఎంత దూరమైనా వెళ్తాడనే పాయింట్ చుట్టూ కథ నడుస్తుంది. సినిమా చూస్తున్న ప్రేక్షకులందరూ భాస్కర్ పాత్రతో కలిసి ప్రయాణం చేస్తారు. అతను గెలవాలని కోరుకుంటారు. ఈ సినిమాలో హీరో ఎవరినీ మోసం చేయకుండా తన తెలివితేటలతో డబ్బు సంపాదిస్తాడు. ఆ పాయింట్ ఆసక్తికరంగా అనిపిస్తుంది' అన్నారు. ఈ సినిమాలో ఎలాంటి సందేశాలు ఉండవనీ, అయితే సినిమా చూసిన వారు మాత్రం మంచి అనుభూతితో బయటకు వస్తారని నాగవంశీ పేర్కొన్నారు.



వేసవిలో 'మాస్ జాతర'

రవితేజ 75వ చిత్రానికి 'మాస్ జాతర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. మే 9న ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో జాతర సందడి నడుమ తుపాకీ పట్టుకొని నడిచి వస్తున్నారు రవితేజ. టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నామని, వినోదానికి పెద్దపీట వేశామని దర్శకుడు తెలిపారు. అభిమానులకు విందుభోజనంగా ఈ సినిమా ఉంటుందని, రవితేజ అభిమానులు కోరుకునే అన్ని అంశాలుంటాయని చిత్రబృందం తెలిపింది. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు.

భక్తితో సీత పాత్ర చేస్తున్నా!

'రామాయణ' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నది అగ్ర కథానాయిక సాయిపల్లవి. రణబీర్‌కపూర్ రాముడి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి నితేష్ తివారి దర్శకుడు. ఈ సినిమాలో సీత పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నానని సాయిపల్లవి ఆనందం వ్యక్తం చేసింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'చిన్నప్పటి నుంచి రామాయణం వింటూ పెరిగాను. సీతమ్మ పాత్రలో నటించే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. నాలోని భయాలన్నింటిని పక్కనబెట్టి సీత పాత్ర కోసం సన్నద్ధమవుతున్నా. ఓ నటిగా కాకుండా భక్తురాలిలా సీత పాత్రలో నటిస్తున్నా. నా కెరీర్‌లో ఇదొక అపురూపమైన చిత్రంగా నిలిచిపోతుంది' అని చెప్పింది.

ఇదే నిజమైన దీపావళి

కన్నడంలో విజయవంతమైన 'సప్తసాగర దాచే ఎల్లో' (తెలుగులో 'సప్తసాగరాలు దాటి') చిత్రం ద్వారా యువతరానికి చేరువైంది కథానాయిక రుక్మిణి వసంత్. ఈ భామ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమా ద్వారా తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. ఆమె కథానాయికగా నటించిన తాజా కన్నడ చిత్రం 'బఘీర' నేడు ప్రేక్షకులముందుకొస్తున్నది. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ కథనందించిన ఈ చిత్రానికి డా।। సూరి దర్శకత్వం వహించారు. హోంబలే ఫిల్మ్స్ నిర్మించింది. ఈ సందర్భంగా రుక్మిణి వసంత్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇదొక సూపర్‌హీరో యాక్షన్ థ్రిల్లర్ మూవీ. ఈ తరహా సినిమాల్లో కథానాయికల పాత్రలకు అంతగా ప్రాధాన్యత ఉండదని అంటారు. కానీ నా క్యారెక్టర్ కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుంది. ఇందులో నేను స్నేహ అనే డాక్టర్ పాత్రలో కనిపిస్తా. ఈ కథలో ఇంటెన్స్ యాక్షన్‌తో పాటు చక్కటి లవ్‌స్టోరీ కూడా ఉంటుంది' అని చెప్పింది. 'సప్తసాగరాలు దాటి' చిత్రం తర్వాత అభినయప్రధాన పాత్రలు లభిస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని ఛాలెంజింగ్ రోల్స్ కోసం ఎదురుచూస్తున్నానని చెప్పింది రుక్మిణి వసంత్. తన కెరీర్‌లో దీపావళి సందర్భంగా విడుదలవుతున్న తొలి సినిమా ఇదేనని, ఈ ఏడాది తనకు నిజమైన దీపావళిలా అనిపిస్తున్నదని ఆ మె ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం తెలుగులో కొన్ని సినిమాల కోసం చర్చలు జరుగుతున్నాయని, ఆ వివరాలను త్వరలో వెల్లడిస్తానని చెప్పింది.

కిరణ్ జర్నీ అందరికీ స్ఫూర్తి!

'నేను ఇంట్రోవర్ట్‌ని. కొత్తవాళ్లతో పెద్దగా కలవను. ఈ మధ్యే కిరణ్ అబ్బవరంను చెన్నైలో కలిశాను. అతనితో మాట్లాడిన కొద్దిసేపటికే దగ్గరి ఫ్రెండ్‌లా అనిపించాడు. తనకు నా వంతుగా సపోర్ట్ చేయాలనిపించింది. అందుకే ఈ వేడుకను వచ్చా' అన్నారు యువహీరో నాగచైతన్య. మంగళవారం జరిగిన 'క' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కిరణ్ అబ్బవరం, నయన్‌సారిక, తన్వీరామ్ ప్రధాన పాత్రల్లో సుజీత్-సందీప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకులముందుకొస్తున్నది. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ..'కిరణ్‌కు ఇండస్ట్రీలో ఎవరి సపోర్ట్ లేకున్నా స్వతహాగా ఎదిగాడు. అతని సక్సెస్ స్టోరీ ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిగా ఉంటుంది. ఈ సినిమా ట్రైలర్ చూశాను. అద్భుతంగా అనిపించింది. తప్పకుండా ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది' అన్నారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'నేను పెద్ద బ్యానర్స్‌లో సినిమాలు చేశా. వాటిలో కొన్ని ఆడాయి. మరికొన్ని ఫెయిల్ అయ్యాయి. అయినా సినిమా కోసం ప్రతీ రోజూ కష్టపడుతూనే ఉన్నా. 'క' చిత్రంతో సరికొత్త ప్రయత్నం చేశాం. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నా' అన్నారు. కిరణ్ అబ్బవరం మీద నమ్మకంతో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాను తెరకెక్కించామని, ఆద్యంతం ప్రేక్షకుల్ని థ్రిల్‌కి గురి చేస్తుందని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.